ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 12 అక్టోబరు 2025







ప్రమాణ స్వీకారం

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి శనివారం ప్రమాణస్వీకారం చేసింది. ఇంద్రకీలాద్రిపై మహా మండపం ఏడో అంతస్తులో ఉన్న కళావేదికపై జరిగిన ఈ కార్యక్రమం ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో జరిగింది. చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు.

6

సూపర్‌ఫాస్ట్..

విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్‌కు టెండర్లు

రూ.661.11 కోట్లతో టెండర్లు పిలిచిన ఆర్‌ఎల్‌డీఏ

- పీపీపీ విధానం, డీబీఎఫ్‌వోటీ పద్ధతిలో ఆహ్వానం
- బిడ్లు సమర్పించటానికి తుది గడువు డిసెంబరు 2
- ఈ నెల 24న నగరంలోని హోటల్‌లో ప్రీబిడ్ మీటింగ్
- 60 ఏళ్లకు లీజు, దశలవారీగా అభివృద్ధికి అవకాశం



విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పట్టాలెక్కింది. అధునాతన రైల్వేస్టేషన్ భవన నిర్మాణానికి రైల్‌ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌ఎల్‌డీఏ) రూ.661.11 కోట్లతో టెండర్లు పిలిచింది. పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌వోటీ) పద్ధతిలో ఈ టెండర్లు పిలిచారు.



విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ డిజైన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ మొత్తం 81,948 చదరపు మీటర్ల పరిధిలో జరుగుతుంది. తూర్పు వైపునకు అభిముఖంగా 57,134 చదరపు మీటర్ల పరిధిలో నిర్మాణం జరుగుతుంది. ఇందుకోసం ఆన్‌లైన్ విధానంలో ఈ-బిడ్లను సమర్పించడానికి 2025, డిసెంబరు 2 మధ్యాహ్నం 3 గంటల వరకు తుది గడువుగా రైల్ ల్యాండ్ డెవలెప్‌మెంట్ అథారిటీ నిర్ణయించింది. ఈ నెల 24 ఉదయం 11 గంటలకు నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఔత్సాహిక సంస్థలతో ప్రీబిడ్ మీటింగ్ నిర్వహించడానికి రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రీ డెవలప్‌మెంట్ ఇలా..

ప్రస్తుతం విజయవాడ రైల్వేస్టేషన్‌లో 83,367 చదరపు మీటర్ల పరిధిలో రైల్వే ఏరియా ఉంది. తూర్పు వైపున జీప్లస్2 విధానంలో 41,770 చదరపు మీటర్ల రైల్వేస్టేషన్ భవనం ఉంది. పశ్చిమ వైపు జీప్లస్2 విధానంలో 6,647 చదరపు మీటర్ల స్టేషన్ బిల్డింగ్ ఉంది. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మూడు ఉన్నాయి. ఈ మొత్తం 4,338 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. రైల్వే కార్యాలయం 4,457 చదరపు మీటర్లు, స్టాఫ్ క్వార్టర్స్ 11 వేల చదరపు మీటర్లలో ఉన్నాయి. ఎంపికైన కాంట్రాక్టు సంస్థ వీటన్నింటినీ అభివృద్ధి చేయాలి. ఆసక్తి చూపిన బిడ్డర్ కమర్షియల్ ఏరియాలను అభివృద్ధి చేయడంతో పాటు పార్కింగ్, మీటింగ్ హాళ్ల వంటివి కూడా నిర్మించాలి. స్కైవాక్‌తో పాటు స్టాఫ్ క్వార్టర్స్ వంటివి కూడా ఉండాలి.

ఎంతెంత వ్యయం

మాండేటరీ కాంపోనెంట్ కాస్ట్ (ఎంసీసీ) కింద చేపట్టాల్సిన పనులను ఆర్‌ఎల్‌డీఏ నిర్దేశించింది. తూర్పువైపు స్టేషన్ భవనం రూ.192.09 కోట్లతో, పశ్చిమవైపు రూ.31.73 కోట్లతో చేపట్టాలి. రూ.7.79 కోట్లతో ఫుడ్‌కోర్టు, రూ.18.62 కోట్లతో సెంట్రల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రూ.62.14 కోట్లతో ప్లాట్‌ఫాం, రూఫ్ మిగతా 6లో..

సపోర్టుగా..

జాతీయ రహదారుల అభివృద్ధి



మాచవరం సమీపంలోని జాతీయ రహదారి-216 (ఇన్‌సెట్‌లో) ట్రంపెట్ నమూనా

- మచిలీపట్నంలోని మాచవరం వద్ద ట్రంపెట్ నిర్మాణం
- ఫ్లై ఓవర్, అండర్ పాస్‌తో రింగురోడ్డు నమూనా
- సమీప గ్రామాల్లో భూసేకరణ పూర్తి
- మచిలీపట్నం పోర్టు, జాతీయ రహదారులను కలుపుతూ..
- ఇప్పటికే ఎన్‌హెచ్-65 ఆరు లేన్ల అభివృద్ధికి ప్రణాళికలు

మచిలీపట్నం పోర్టు నిర్మాణం నేపథ్యంలో జాతీయ రహదారులు.. అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయి. ముఖ్యంగా మచిలీపట్నం సమీపంలోని మాచవరం వద్ద జాతీయ రహదారి-216పై అత్యాధునిక పద్ధతిలో ట్రంపెట్ నమూనాతో రింగ్‌రోడ్డును నిర్మించనున్నారు. పోర్టు నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఫ్లైఓవర్, అండర్‌పాస్‌తో పాటు రింగురోడ్డు నిర్మించనున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : దేశంలో సముద్రతీరం లేని రాష్ట్రం తెలంగాణా మాత్రమేనని, తెలంగాణాకు దగ్గరలో ఉన్నది మచిలీపట్నం పోర్టు అని, సరుకుల ఎగుమతులు, దిగుమతులకు మచిలీపట్నం పోర్టు ఎంతో ఉపయోగపడుతుందని ఇటీవల తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారుల అభివృద్ధి అంశం తెరపైకి వచ్చింది. మచిలీపట్నం పోర్టు నిర్మాణం జరిగితే తెలంగాణా నుంచి మచిలీపట్నం వరకు జాతీయ రహదారి-65ను ఆరులేన్లుగా అభివృద్ధి చేసే ప్రణాళిక ఇప్పటికే సిద్ధమవుతోంది. ఈ ప్రతిపాదనల్లో భాగంగా మచిలీపట్నం వద్ద జాతీయ రహదారి-65, 216ను కలిపే ప్రాంతాన్ని మాచవరం వరకు అభివృద్ధి చేసేందుకు ఎన్‌హెచ్ అధికారులు నమూనాను రూపొందించారు. ఈ నమూనాలో భాగంగా మాచవరం సమీపంలో ట్రంపెట్ రింగ్‌రోడ్డును అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధం చేశారు. మాచవరం సమీపంలో జాతీయ రహదారి-216 వద్ద దీనిని నిర్మిస్తారు. ఇందుకోసం భూసేకరణ కూడా జరిగింది. ట్రంపెట్ నమూనాలో భాగంగా జాతీయ రహదారి-216పై ఒక ఫ్లైఓవర్, మరో అండర్‌పాస్‌ను నిర్మిస్తారు. పోర్టు నుంచి సరుకులు రవాణా చేసే వాహనాలు ఎక్కడా నిలిచిపోకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకే వీటిని నిర్మిస్తున్నారు.

ఉత్తర తెలంగాణాను కలుపుతూ..

జాతీయ రహదారి-216.. తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు ఉంటుంది. ఈ రహదారి కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలంలోని లక్ష్మీపురం, బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం, చల్లపల్లి, అవనిగడ్డ, పులిగడ్డ వారధి మీదుగా గుంటూరు జిల్లాలోకి వెళ్తుంది. ఈ జాతీయ రహదారికి అనుబంధంగా పెడన నుంచి గుడివాడ, హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు మీదుగా తెలంగాణాలోని ఖమ్మం జిల్లాలో కలిపే రహదారి నిర్మాణంలో ఉంది. ఈ రహదారి మీదుగా ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లోని బియ్యం, మార్బుల్స్, సిమెంట్ తదితరాలను తక్కువ రవాణా చార్జీలతో మచిలీపట్నం పోర్టుకు తరలించి విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని సాంకేతిక నిపుణుల అంచనా. ఉత్తర తెలంగాణాలోని మిగతా 6లో..

సర్వీస్, స్లిప్ రోడ్లు అవసరం

మాచవరం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారని, ఈ నమూనాలో అండర్‌పాస్ వచ్చినచోట 5.50 మీటర్ల వెడల్పుతో స్లిప్‌రోడ్లను, ఫ్లైఓవర్ ప్రాంతంలో ఏడు మీటర్ల వెడల్పుతో సర్వీస్ రోడ్డును నిర్మించాలని స్థానిక గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అవసరమైన చోట వీటిని ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. వీటిని నిర్మిస్తే రైతులు పండించిన ధాన్యం రవాణాకు, ప్రయాణ అవసరాలకు ఇబ్బందులు తలెత్తవంటున్నారు. మచిలీపట్నం అభివృద్ధి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారుల విస్తరణను ఎలాంటి లోపాలు లేకుండా చూడాలంటున్నారు.

కొత్త వ్యవసాయ విధానాలపై దృష్టి

- ఆయిల్‌పామ్, కొరమేను సాగుతో లాభాలు
- ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో కలెక్టర్ బాలాజీ

8లో

రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు

- అడ్డుకున్న వీఆర్వో.. వీడియో తీస్తున్న పాత్రికేయులకు అంతుచూస్తానంటూ బియ్యం వ్యాపారి బెదిరింపు

6లో

కల్తీ కేసులో కిక్కు

నకిలీ మద్యం తయారీ మొదలైంది వైసీపీ హయాంలోనే..

- 2021 నుంచి వ్యాపారం సాగించిన జనార్దనరావు
- నాటి ఊరుపేరూ లేని బ్రాండ్లను అడ్డుపెట్టుకుని వ్యాపారం
- మద్యం తయారీలో అధ్యయనానికే ఆఫ్రికా టూర్
- రాజకీయాలను అడ్డుపెట్టుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం
- కేసులో ఓ రాజకీయ పార్టీ నేత 'హస్తం'



విజయవాడ జిల్లాకోర్టు వద్ద ప్రధాన నిందితుడు జనార్దనరావు

నకిలీ మద్యం తయారీ కేసులో అందరూ అన్నకున్నదే అయ్యింది. అంతా ఊహించినట్టుగానే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఈ వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా నడిచింది. ఎక్సైజ్ అధికారులు ఇంతకుముందు నిందితులను అరెస్టు చేసినప్పుడు.. మూడు నెలల క్రితం నుంచి ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు తెలిపారు. కానీ, 2021 నుంచే ఈ వ్యాపారం సాగించామని ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు ఒప్పుకోవడం సంచలనంగా మారింది.

విజయవాడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం తయారీ వ్యాపారం 2021 నుంచే మొదలైంది. వైసీపీ పాలనలో ఊరుపేరూ లేని బ్రాండ్లను విక్రయించడంతో నకిలీ మద్యం తయారీకి ఇదే మంచి అదును అనుకున్నాడు ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు. అనుకున్నట్టుగానే హైదరాబాద్‌లోని నిజాంపేటలో నకిలీ మద్యం తయారీకి బీజాలు వేసుకున్నాడు. ఎన్టీఆర్, అన్నమయ్య జిల్లాల్లోనే కాకుండా మిగతా 6లో..



ఛాంగీ విమానాశ్రయం

సింగపూర్‌కు ఇండిగో

ఆరేళ్ల కల సాకారం

- విజయవాడ-సింగపూర్ సర్వీసు పునరుద్ధరణ
- నవంబరు 15 నుంచి వారంలో మూడుసార్లు
- గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంచి ఆదరణ
- 90 శాతం ఆక్యుపెన్సీతో నడిచిన విమానాలు
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక సర్వీసు రద్దు
- వ్యాపారులు, పర్యాటకులు, విద్యార్థుల నుంచి డిమాండ్
- కూటమి ప్రభుత్వ చొరవతో ఇన్నాళ్లకు అందుబాటులోకి..



విజయవాడ విమానాశ్రయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆరేళ్ల విరామం తర్వాత ఎట్టకేలకు విజయవాడ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు ప్రారంభమవుతోంది. నవంబరు 15 నుంచి వారంలో మూడు రోజులు ఈ అంతర్జాతీయ విమానాలు నడవనున్నాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ ఈ విమాన సర్వీసులను ప్రారంభిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనలో అక్కడి పెట్టుబడిదారులు, ప్రతినిధులు సింగపూర్ విమాన సర్వీసు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించగా, చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పలుమార్లు విజయవాడ వచ్చినప్పుడు సింగపూర్ సర్వీసు విషయంలో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వారి హామీలు నెరవేరి వచ్చేనెల నుంచి సింగపూర్ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి మిగతా 6లో..

ఆరేళ్ల కల ఫలించింది. ఎట్టకేలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసులు నడపాలని నిర్ణయించారు. నవంబరు 15 నుంచి వారంలో మూడు రోజులు ఈ సర్వీసులు నడిపేందుకు అంతా సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు కృషితో తీసుకున్న ఈ నిర్ణయంపై వ్యాపారులు, విద్యార్థులు, ఎన్నారైలు, పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇనుము.. రూపాలు కనుము..

విజయవాడలో అందంగా స్క్రాప్ పార్కు

కాదేదీ కళకు అనర్హం అన్నట్టుగా.. ఇనుప బోల్టులు, నట్లు, స్ప్రింగులతో అందమైన కళాకృతులను తీర్చిదిద్దారు. విజయవాడలోని బందరు రోడ్డు, ఏలూరు రోడ్డుపై రాకపోకలు సాగించే వారికి ఇవి కనువిందు చేస్తున్నాయి. పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న వీఎంసీ స్క్రాప్ పార్కు కొత్త హంగులతో ఆకట్టుకుంటోంది. ఐరన్ జంతువుల బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

8

బెజవాడ-బెంగళూరు వందేభారత్ ఎప్పటికి?

మలివిడతలోనూ నిరాశేనా?

వందేభారత్ మలివిడత రైళ్ల కేటాయింపులో విజయవాడకు ప్రాధాన్యత దక్కుతుందని అందరూ భావించారు. రైల్వేబోర్డు నిర్ణయాల కారణంగా విజయవాడ-బెంగళూరుకు అవకాశం దక్కని పరిస్థితి కనిపిస్తోంది. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ రైలు నడిపితే తక్కువ సమయంలో గమ్యస్థానం చేరుకునే అవకాశం ఉంటుంది. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కావాలనుకునే ప్రయాణికులు.. రైల్వేబోర్డుకు తాకేలా స్వరాన్ని వినిపించాల్సిన అవసరం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కలగానే మిగిలిపోనుందా? అని ప్రశ్నించుకుంటే అవుననే సమాధానమే వస్తుంది. మలివిడతగా ఇచ్చే వందేభారత్ రైళ్లలో విజయవాడకు అవకాశం లేదని తెలుస్తోంది. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది. తగిన ప్రతిపాదనలు పంపాలని రైల్వేబోర్డు నుంచి విజయవాడ డివిజన్ అధికారులకు ఆదేశాలు కూడా వచ్చాయి. విజయవాడ డివిజన్ అధికారులు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఏ సమయంలో విజయవాడ-బెంగళూరు వందేభారత్‌ను నడపాలి? ఏయే స్టేషన్లకు హాల్టింగ్ ఇవ్వాలి? వంటి వివరాలతో కూడిన షెడ్యూల్‌ను రూపొందించి అందజేశారు. కానీ, రైల్వేబోర్డు నుంచి సానుకూల స్పందన రాలేదు. మలివిడతగా ఇచ్చే వందేభారత్ రైళ్లలో విజయవాడకు అవకాశం లేదని తెలుస్తోంది.

మలివిడత కేటాయింపుల్లోనూ లేనట్టే..!

- ఇప్పటికే ప్రతిపాదనలు కోరిన రైల్వేబోర్డు
- నివేదిక అందజేసిన విజయవాడ అధికారులు
- అయినా విజయవాడ డివిజన్‌పై చిన్నచూపు



డిమాండ్ ఉన్నా..

దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా ఉన్న విజయవాడ మీదుగా గూడ్స్‌తో కలిపి నిత్యం 400 పైబడి రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఆదాయం కూడా గణనీయంగా వస్తోంది. కానీ, విజయవాడ డివిజన్ విషయంలో రైల్వేబోర్డు స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కొత్త రైళ్ల కేటాయింపు విషయంలో అన్యాయం జరుగుతోందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. విజయవాడ నుంచి తమిళనాడు, కర్నాటక వెళ్లే రైళ్లన్నీ రద్దీగా నడుస్తాయి. సీజన్లతో సంబంధం లేకుండా వీటికి డిమాండ్ ఉంటుంది. డిమాండ్‌కు సరిపడా రైళ్లు మాత్రం తిరగట్లేదు. బెంగళూరుకు వేగవంతమైన ప్రయాణాన్ని కోరుకుంటున్న వారంతా సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అడ్వాన్స్‌గా బుకింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. వీకెండ్స్, సెలవుదినాల్లో ఈ రెండు ప్రధాన రూట్లలో బెర్త్ దొరకడం కష్టమే.



హైకోర్టు జడ్జి మల్లిఖార్జునరావుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు జడ్జి మల్లిఖార్జునరావు దంపతులు

మోపిదేవి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని హైకోర్టు జడ్జి టి.మల్లిఖార్జునరావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన మల్లిఖార్జునరావు దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత హైకోర్టు జడ్జి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మల్లిఖార్జునరావు దంపతులకు స్వామి వారి చిత్ర పటం, ప్రసాదాలు అందించి శేషవస్త్రాలతో సత్కరించారు.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పండుగలు దృష్ట్యా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు వివిధ ప్రాంతాల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్.ఎస్.నాందేడ్ - అనకాపల్లి (07037) రైలు ప్రతి మంగళవారాలలో బయలుదేరుతుంది. ఈనెల 14 నుంచి నవంబరు 25 వరకు ఏడు సర్వీసులు నడుస్తుంది. ఇదే రైలు తిరుగు ప్రయాణంలో అనకాపల్లి నుంచి బుధవారాలలో బయలుదేరుతుంది. 07038 నెంబరు గల ఈ రైలు ఈనెల 15 నుంచి నవంబరు 26 వరకు ఏడు సర్వీసులు నడుస్తుంది. ఈ రైలు ముద్ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకువీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్లలో ఆగుతుంది. 07070 హైదరాబాద్ - హజరత్ నిజాముద్దీన్ ఈనెల 13వ తేదీ సోమవారం బయలుదేరుతుంది. 07071 తిరుపతి - హజరత్ నిజాముద్దీన్ ఈనెల 12వ తేదీ ఆదివారం బయలుదేరుతుంది. 07099 హెచ్.ఎస్.నాందేడ్ - హజరత్ నిజాముద్దీన్ ఈనెల 12వ తేదీ ఆదివారం బయలు దేరుతుంది. ఈ మూడు రైళ్లు ఒక్కో ట్రిప్పు మాత్రమే తిరుగుతాయి.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్ఐఆర్డీపీఆర్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మొహమ్మద్

విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఎంవోయూ

వన్‌టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్డీపీఆర్), కేశినేని ఫౌండేషన్ మధ్య శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఎన్ఐఆర్డీపీఆర్ తరఫున సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మొహమ్మద్ ఖాన్, కేశినేని ఫౌండేషన్ తరఫున విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సంతకాలు చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యమన్నారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి సృష్టి, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, సుస్థిర వ్యవసాయం వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రాజెక్టు మొదటి దశలో అభివృద్ధికి ఎ.కొండూరు, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాలను ఎంపిక చేశారు ఈ మండలాల్లో సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా ప్రాజెక్టులు అమలు కానున్నాయి. అక్టోబరు 22న స్థానిక పరిపాలన అధికారులతో కలిసి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవీంద్ర గవలి, డాక్టర్ కేశవరావు, డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ సంధ్యా గోపకుమారన్, డాక్టర్ నిత్య, మురళీ కృష్ణ, కె.బి. బెహరా, కేశినేని ఫౌండేషన్ డైరెక్టర్ కేశినేని వెంకట్ పాల్గొన్నారు.



ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం

రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు

- అడ్డుకున్న వీఆర్వో, వీడియో తీస్తున్న పాత్రికేయులకు అంతుచూస్తానంటూ బియ్యం వ్యాపారి బెదిరింపు

వీరులపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రేషన్ బియ్యం తరలించడమే కాకుండా, అడ్డుకున్న రెవెన్యూ అధికారి , పాత్రికేయుల ఫోన్లను నేలకేసి కొట్టి, మీ అంతు చూస్తానంటూ రేషన్ బియ్యం వ్యాపారి బెదిరించిన సంఘటన అల్లూరులో శుక్రవారం సాయంత్రం జరిగింది. జుజ్జూరు వైపు నుంచివస్తున్న ఆటోలో రేషన్ బియ్యం అక్రమగా రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో వీఆర్వో బేబి మార్గమధ్యలో అల్లూరు వద్ద ఆటోను ఆపి పరిశీలించారు. ఆటోలో 20 బస్తాల రేషన్ బియ్యం గుర్తించారు. ఆటోను ఆపారని తెలుసుకున్న రేషన్ బియ్యం వ్యాపారి కాజా సత్యనారాయణ అక్కడకు చేరుకొని వీఆర్వోపైన, వీడియో తీస్తున్న ఇద్దరు పాత్రికేయులపైన చిందులేస్తూ, వారి ఫోన్స్ లాక్కొని నేలకేసి కొట్టి మీ అంతు చూస్తానని బెదిరించి, బియ్యం ఆటోతో అక్కడ్నుంచి ఉడాయించాడు. వీఆర్వో బేబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ప్రభుత్వ డెంటల్ కళాశాలలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- గడువు 20 వరకు పొడిగింపు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రభుత్వ దంత వైద్యశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు గడువు ఈ నెల 13వ తేదీగా ప్రకటించామని, అయితే ఈ గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు వెల్లడించారు. డెంటల్ మెకానిక్, డెంటల్ టెక్నీషియన్, డెంటల్ హైజినిస్ట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపుగా ఆసుపత్రిలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సిందిగా కోరారు.

దుర్గగుడి పాలకమండలి ప్రమాణ స్వీకారం

- చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ (గాంధీ) బాధ్యతల స్వీకారం
- మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి, ఎమ్మెల్యేల అభినందన

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం శనివారం మహామండపం ఏడో అంతస్థు కళావేదిక మీద జరిగింది. దుర్గగుడి ఈవోవి.కె.శీనానాయక్ పర్యవేక్షణలో దుర్గగుడి కమిటీ చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ (గాంధీ), సభ్యులుగా అవ్వారు శ్రీనివాసరావు, బడేటి ధర్మారావు, గూడపాటి వెంకట సరోజినీ దేవి, జి.వి.నాగేశ్వరరావు, జి.హరికృష్ణ, జింకా లక్ష్మీదేవి, మన్నే కళావతి, మోరు శ్రావణి, పనబాక భూలక్ష్మి, పెనుమత్స రాఘవరాజు, ఏలేశ్వరపు సుబ్రహ్మణ్య కుమార్, సుకాసి సరిత, తంబళ్లపల్లి రమాదేవి, తోటకూర వెంకట రమణారావు, తరిగొప్పల పార్వతి, ప్రత్యేక ఆహ్వానితులుగా వెలగపూడి శంకర్‌బాబు, మార్తి రామబ్రహ్మం, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దుర్గగుడి ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం దుర్గగుడి కమిటీ చైర్మన్ తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏసీ రంగారావు, ఏఈవోలు సుధారాణి, వెంకటరెడ్డి, పీఆర్వో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు. దుర్గగుడి పాలకమండలి సభ్యురాలిగా నియమితులైన భవానీపురానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు పద్మావతి ఠాకూర్ శనివారం జరిగిన పాలకమండలి ప్రమాణ స్వీకారానికి వ్యక్తిగత కారణాల వలన హాజరు కాలేకపోయినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న రాధాకృష్ణ



అభినందించి, సత్కరిస్తున్న మంత్రులు పార్థసారథి, రవీంద్ర

దుర్గగుడి అభివృద్ధికి కృషి : గాంధీ

రాష్ట్రంలోని రెండో అతిపెద్ద దేవాలయం దుర్గామల్లేశ్వర దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని దుర్గగుడి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఈవో శీనానాయక్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దుర్గగుడి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోవటం తన తల్లిదండ్రులు చేసిన పుణ్యమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాలక మండలి సభ్యులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు అందరితో కలిసి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తూ, భక్తులకు వసతులు, సౌకర్యాలను కల్పిస్తామన్నారు. దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలుకు అన్ని విధాలుగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దేవస్థానంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, రాజకీయాలకు తావులేకుండా సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామన్నారు. తనకు దుర్గగుడి చైర్మన్ పదవి రావటంపై కొందరు విమర్శలు చేస్తున్నారని, తనగురించి పూర్తిగా తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఈవో వి.కె.శీనానాయక్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ధర్మకర్తల మండలి సహకారంతో ముందుకు వెళతామని, భక్తులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. భక్తుల అవసరాల కోసం కొండ దిగువన అర్జునవీధిలో నూతనంగా సమాచార కేంద్రం ఏర్పాటు చేశామని, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లలతో వచ్చే వారికి కొత్త బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

మంత్రులు, ఎమ్మెల్యేల అభినందనలు

దుర్గామల్లేశ్వర దేవస్థానం పాలకమండలి చైర్మన్, సభ్యులను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ నాయకులు అభినందించారు. మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, తంగిరాల సౌమ్య, బోడె ప్రసాద్, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, పార్టీ నాయకులు చైర్మన్ బొర్రా రాధాకృష్ణను అభినందించి సత్కరించారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, దుర్గగుడి పాలక మండలి

పాలకమండలి ప్రమాణస్వీకారం అనంతరం మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, తంగిరా సౌమ్య, దుర్గగుడి పాలక మండలి చైర్మన్, సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో శీనానాయక్, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు.

వర్షాలతో పత్తిరైతు కుదేలు

- రాలిపోతున్న పింజలు
- కుళ్లిపోతున్న కాయలు
- నాణ్యతపై తీవ్ర ప్రభావం



వర్షాలకు చెట్లపై కుళ్లిపోతున్న పత్తి కాయలు

(జి.కొండూరు-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది తెల్ల బంగారం (పత్తి) పండించే రైతులను వర్షాలు కలవర పెడుతున్నాయి. రెండ్రోజులకోసారి పడే వర్షాలు పత్తి పంటకు తీవ్ర నష్టం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 67,614 వేల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యింది. గంపలగూడెం మండలంలో అత్యధికంగా 10,966 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వత్సవాయి మం డలంలో 8,903 ఎకరాల్లో, చందర్లపాడు మండలంలో 7,918 ఎకరాల్లో, జి.కొండూరు మండలంలో 6,684 ఎకరాల్లో పత్తి పంట సాగయ్యింది. వరుస వర్షాల కారణంగా నల్లరేగడి భూముల్లో ఉన్న పత్తి పంట కొన్ని చోట్ల అధిక తేమకు జీవం కోల్పోయింది. కొన్ని చోట్ల పత్తితీతలు ప్రారంభం అయ్యాయి. తొలి తీత ఎకరానికి మూడు క్వింటాళ్ల నుంచి 3.5 క్వింటాళ్ల వరకు వస్తున్నా పెద్దగా నాణ్యత ఉండటం లేదని, దానిని కొనేవారు ఉండరంటున్నారు రైతులు. మరి కొన్ని చోట్ల తేమకు పత్తితీతలు ఇంకా ప్రారంభించలేదు. చెట్లకు ఉంటేనే పత్తి త్వరగా ఆరుతుందనే భావనలో అన్నదాతలున్నారు. వర్షాలు మాత్రం ఆగడం లేదు. వరుస వర్షాలకు కాయలు కుళ్లిపోతున్నాయని, పింజలు రాలి కింద పడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇంతటితో వర్షాలు ఆగితే పర్వాలేదు కాని మరలా వర్షాలు పడితే మాత్రం పత్తి పంట చేతికి రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాలిపోయిన పత్తి

సగానికి సగం దెబ్బతింది

వర్షాలకు సగానికి సగం పంట దెబ్బతింది. పైన ఉన్న గూడు రాలిపోయింది. సగం కాయలు కుళ్లిపోయాయి. వాతావరణ ఇలానే ఉంటే అసలు పంట చేతికొచ్చే పరిస్థితి ఉండదు. మందుల ఖర్చు రెట్టింపు అయ్యింది. తేమ శాతం తో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేస్తే తప్ప ఖర్చులు సైతం వచ్చే అవకాశాలు లేవు.

-కోమటి సుబ్బారావు, గడ్డమణుగు

రైతులకు సూచనలివే

వర్షాల వల్ల భూమిలోని తేమను నివారించుకునేందుకు ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ సాళ్లలో వేసుకోవాలి. కాపారక్షిక్లోరైడ్ (బ్లైటాక్స్) ఎకరానికి 600 గ్రాముల మందును, ప్లాంటామైసిన్ 50 గ్రాముల మందును 100 లీటర్ల నీటిలో కలిపి పైపాటుగా పిచికారి చేసుకోవాలి. మెగ్నీషియం లోపం ఉంటే మెగ్నీషియం సల్ఫేట్ కిలో 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

- కె.సీహెచ్ సూరిబాబు, వ్యవసాయాధికారి, జి.కొండూరు

లంచం ఇస్తేనే లే అవుట్ల క్రమబద్ధీకరణ!

- సీఆర్డీఏ పట్టణ ప్రణాళికా విభాగంలో అవినీతి జలగలు
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు ముందుకు రాని ప్రజలు

లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని సీఆర్డీఏ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు సొమ్ము చేసుకుంటున్నారు. క్రమబద్ధీకరణ కావాలంటే లంచం ఇవ్వాల్సిందేనంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుందామనుకుంటుంటే, సీఆర్డీఏలోని లంచావతారుల పుణ్యమా అని ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే పరిస్థితి ఏర్పడింది. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఉన్నతాధికారులు స్పందించ లేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సీఆర్డీఏ పట్టణ ప్రణాళికా విభాగంలోకి కొంత కాలం కిందట సచివాలయాల నుంచి ఉద్యోగులను డిప్యూటేషన్ పద్ధతిలో తీసుకున్నారు.. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నాన్ లేవుట్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించి ఇవ్వటానికి అధికారులు ఈ ఉద్యోగులను ఫీల్డ్‌కు పంపుతున్నారు. అయితే, క్షేత్ర స్థాయి పరిశీలన పేరుతో వీరు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్లు చేస్తున్నారు. కొంతమంది జంకూ గొంకూ లేకుండా ఫోన్లలోనే తాము ఫలానా రోజు, ఫలానా సమయానికి వస్తున్నామని, డబ్బులు సిద్ధం చేసుకోవాలంటూ తెగేసి చెబుతున్నారు. వచ్చిన తర్వాత బేరసారాలుండవంటూ మరికొంద రు కరాఖండిగా చెపుతున్నారు. ఇంకొందరు ఫీల్డ్ విజిట్‌కు వచ్చిన క్రమంలో తమ మనసులో మాట బయట పెడుతున్నారు. నాన్ లే అవుట్ల క్రమబద్ధీకరణకు అపరాధ రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. క్షేత్ర స్థాయిలో పరిశీలించటానికి వచ్చిన వారు రూ.లక్షల్లో లంచాలివ్వాలని పీక్కుతింటుంటే మున్ముందు వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులకు ఏ రకంగా లంచం సమర్పించుకోవాల్సి వస్తుందోనని దరఖాస్తుదారులు భయపడే పరిస్థితి వచ్చింది.



క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్న సిబ్బంది నాన్ లేఅవుట్లకు సంబంధించిన వాస్తవ అతిక్రమణలను గుర్తించి నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకరకంగా గ్రౌండ్ రిపోర్టును ఇవ్వాల్సి ఉంటుంది. ఎల్ఆర్ఎస్ అనేదే క్రమబద్ధీకరణ పథకం. అపరాధ రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేయించుకోవటమే ఈ పథకం ఉద్దేశ్యం. కానీ, గ్రౌండ్ రిపోర్టు పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాస్తవ పరిస్థితులను దాచి, మీకు ప్రయోజనం కలుగుతుందంటూ క్షేత్ర స్థాయి సిబ్బంది లంచాలను డిమాండ్ చేస్తున్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది చెప్పే మాటలకు నాన్ లే అవుట్ల యజమానులేమీ వారి బుట్టలో పడిపోవటం లేదు. ఎందుకంటే ఒక లే అవుట్‌లో నిర్ణయించిన దానికంటే రోడ్డు వెడల్పు లేకపోతే, ఆ రోడ్డు పక్కనే ఉన్న ఫ్లాట్‌లో ఇంటిని నిర్మించుకుని ఉంటే.. చాలా సమస్యలు వస్తాయి... ఇప్పుడు తప్పించుకున్నా రేపు బీపీఎస్‌లోనూ సమస్యలు వస్తాయి.. కాబట్టి క్షేత్ర స్థాయిలో చాలా మంది నాన్ లే అవుట్ యజమానులు లంచాలు ఇవ్వటానికి ససేమిరా అంటున్నారు. కొందరు అంత కాదులే అంటూ కొంత మేర చేతిలో పెట్టి పంపిస్తున్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో చూస్తే ఎన్నో ఎల్ఆర్ఎస్ అవకాశాలు వచ్చాయి. నాన్ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పేరుతో మాత్రం కిందిస్థాయిలోనే సిబ్బంది లంచాలు డిమాండ్ చేయటం ఇదే ప్రథమమని భవన నిర్మాణరంగానికి చెందిన పలువురు చెబుతున్నారు.

ఊపందుకోని దరఖాస్తులు

ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 23వ తేదీ వరకు అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గడువు పెంచితే చెప్పలేం కానీ.. మరో పక్షం రోజుల సమయం ప్రస్తుతం ఉంది. దాదాపుగా ఐదు వేలకు పైగా నాన్ లే అవుట్లు ఉంటే.. ఇప్పటి వరకు కేవలం రెండు వేల వరకు మాత్రమే దరఖాస్తులు రావడం చూస్తే, ఎందుకో వేగం లేదనిపిస్తోంది. కారణాలు ఏమై ఉంటాయన్నది అంతు చిక్కటం లేదు.

సీఆర్డీఏ పరిధిలో భారీగా అక్రమ లే అవుట్లు

రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్డీఏ) పరిధి ప్రస్తుత ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో ఉంది. డెవలప్‌మెంట్ జోన్ల ప్రాతిపదికన సీఆర్డీఏ గతంలో గుర్తించిన కొన్ని నాన్ లే అవుట్ల జాబితాను అధికారికంగా విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం చూస్తే నూజివీడు జోన్ పరిధిలో 29 నాన్ లే అవుట్లు ఉన్నాయి. నందిగామ జోన్‌లో 11, గన్నవరం జోన్‌లో 16, ఉయ్యూరు జోన్‌లో 12 , సెంట్రల్ జోన్ పరిధిలో ఐదు, గుంటూరు జోన్ పరిధిలో 36, తెనాలి జోన్ పరిధిలో 31 లే అవుట్లు ఉన్నాయి. సీఆర్డీఏ అధికారిక లెక్కల ప్రకారం చూస్తే కేవలం 130 లే అవుట్లు మాత్రమే ఉన్నాయి. వాస్తవంగా చూస్తే సీఆర్డీఏ పరిధిలో వెయ్యికిపైగానే నాన్ లే అవుట్లు ఉన్నాయి. ఈ నాన్ లే అవుట్లు అన్నింటినీ కూడా చాలా వరకు సీఆర్డీఏ ప్లానింగ్ విభాగం అధికారులు గతంలో చూసీ చూడనట్టు వదిలేశారు. పాతవి కూడా కలిపితే నాలుగు వేలకు పైగా నాన్ లే అవుట్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు రెండు వేల వరకు లే అవుట్లు వచ్చాయి.

ఎయిర్ కార్గో ఫోరం ఇండియా ఏపీ చాప్టర్ చైర్మన్‌గా సాంబశివరావు ఎన్నిక

అమరావతి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ కార్గో ఫోరం ఇండియా (ఏసీఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ చైర్మన్‌గా ఏపీ చాంబర్స్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గడ గొట్టు సాంబశివరావు ఎన్నికయ్యారు. సాంబశివరావు ఎన్నికతో ఏపీ ఛాంబర్స్ ఏసీఎఫ్ఐ కలిసి రాష్ట్రంలో అంతర్జాతీయ ఎయిర్ కార్గో సదుపాయాల అభివృద్ధికి సమర్థంగా పని చేయగలవని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రస్తుతం ఏపీలో ఉన్న విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఎయిర్ కార్గో కార్యకలాపాల అభివృద్ధికి గొప్ప అవకాశాలున్నాయి. రాష్ట్రం నుంచి మెరైన్ ఉత్పత్తులు, పువ్వులు, ఔషధాలు, మొక్కల ఎగుమతులతోపాటు పారిశ్రామిక, ఓడల విడిభాగాలు, బంగారం, వెండి, వజ్రాల వంటి ఉత్పత్తుల దిగుమతులు పెంచేందుకూ అవకాశాలున్నాయి. ప్రస్తు తం ఏపీ నుంచి పచ్చి పదార్థాల ఎగుమతులన్నీ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాల నుంచి జరుగుతున్నాయి. దీనికి రాష్ట్రంలోని ప్రధాన విమానాశ్రయాల్లో సరిపడినంతగా ఎయిర్ కార్గో మౌలిక సదుపాయాలు లేకపోవడమే కారణం. రాష్ట్రంలో ఎయిర్ కార్గో కనెక్టివిటీ బలోపేతమైతే పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ కంపెనీలు లాభపడతాయి' అని భాస్కరరావు వివరించారు.

కల్తీ కేసులో కిక్కు

(5వ పేజీ తరువాయి)

తెలంగాణలోని మద్యం దుకాణాల్లోనూ నకిలీ మద్యాన్ని విక్రయించాడు.

మద్యం తయారీ అధ్యయనం కోసమే ఆఫ్రికా

తనకు ఆరోగ్యం బాగోకపోవడంతో వైద్యం చేయించుకోవడానికి విదేశాల్లో ఉన్నానని జనార్దనరావు సెల్ఫీ వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇదంతా అవాస్తవమని రిమాండ్ రిపోర్టును బట్టి తెలుస్తోంది. అంతా అనుమానించినట్టుగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో రాజకీయ నాయకుడిగా ఉన్న జయచంద్రారెడ్డితో ఇంజనీరింగ్ విద్య నుంచి జనార్దనరావుకు స్నేహం ఏర్పడింది. జయచంద్రారెడ్డి టీడీపీలోకి రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఇక తిరుగులేదనుకున్నాడు. వైసీపీ పాలనలో మొత్తం నకిలీ మద్యాన్ని ఏఎన్నార్ బార్‌లో విక్రయించిన జనార్దనరావు దాన్ని ఇప్పుడు మరింత విస్తృతం చేద్దామను కున్నాడు. ఈ క్రమంలోనే జయచంద్రారెడ్డితో కలిసి ఆఫ్రికా పర్యటనకు వెళ్లాడు. తెలివిగా ముందు జయచంద్రారెడ్డిని ఆఫ్రికాలోని ల్యూండా ప్రాంతానికి పంపాడు. తర్వాత గతనెల 25న జనార్దనరావు వెళ్లాడు. ఆఫ్రికాలో అనధికారికంగా మద్యం తయారీ విస్తృతంగా జరుగుతోంది. అక్కడున్న విధానాలు, పద్ధతులను అధ్యయనం చేశాక వాటిని ఇక్కడ అమలు చేయాలని భావించాడు. వాస్తవానికి నకిలీ డిస్టలరీ వ్యవహారం బయటకు రాకపోతే ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో జరిగే నకిలీ మద్యం తయారీకి నూతన యంత్ర సామాగ్రిని అమర్చడానికి స్కెచ్ వేశారు. దీన్ని అధ్యయనం చేయడానికి వారు ఆఫ్రికా వెళ్లారని తెలుస్తోంది.

మరకలు ఇంకెంతమందికో..

జనార్దనరావుతో దోస్తీ కట్టి నకిలీ మద్యం తయారీలో పాలు పంచుకున్న రాజకీయ నేతల పేర్లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇప్పటికే జయచంద్రారెడ్డి పేరు బయటకు రాగా, టీడీపీ ఆయనపై వేటు వేసింది. తాజాగా ఇబ్రహీంపట్నానికి చెందిన మరో నాయకుడి పేరు వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో ఆనవాళ్లు అంతంతమాత్రంగా ఉన్న ఓ రాజకీయ పార్టీకి చెందిన నేత జనార్దనరావుతో కరచాలనం చేశాడు. ఆయనతో పాటు మరికొంతమంది హైదరాబాద్‌లో ఈ-7 పేరుతో మద్యం దుకాణాన్ని నిర్వహించారు. తర్వాత ఈ బృందమంతా కలిసి గోవా పర్యటనకు వెళ్లింది. అక్కడ బాలాజీ అనే వ్యక్తితో జరిగిన చర్చల నుంచి నకిలీ మద్యం తయారీ ఆలోచనలకు అడుగులు పడ్డాయి. నకిలీ మద్యం తయారీ స్కెచ్ మొత్తం గోవా నుంచి మొదలైంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు ప్రముఖుల పేర్లు బయటకు వస్తున్నాయి. త్వరలో ఇంకెన్ని వస్తాయో చూడాలి.

సూపర్‌ఫాస్ట్‌గా..

(5వ పేజీ తరువాయి)

ఆధునికీకరణ, రూ.28.34 కోట్లతో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, రూ.8.39 కోట్లతో స్కైవాక్, రూ.33.48 కోట్లతో పార్కింగ్ ఫ్లోర్స్, రూ.9.95 కోట్లతో రైల్వే ఆఫీస్ ఫ్లోర్, రూ.10.45 కోట్లతో డీమాలిషన్ పనులు, రూ.37.73 కోట్లతో రెసిడెన్షియల్ క్వార్టర్లు, రూ.35.76 కోట్లతో సైట్ డెవలప్‌మెంట్, రూ.56.44 కోట్లతో ఎక్స్‌టర్నల్ ఎలక్ట్రికల్ వర్క్స్, సబ్‌స్టేషన్, సోలార్ పవర్ జనరేషన్, లైటింగ్ వంటివి ఏర్పాటుచేయాలి. అలాగే, నాన్ మాండేటరీ కాంపోనెంట్ కాస్ట్ (ఎన్ఎంసీసీ) కింద రూ.103.34 కోట్లతో కమర్షియల్ బిల్డింగ్, రూ.61.60 కోట్లతో హోటల్, రూ.19.91 కోట్లతో కమర్షియల్ ఫ్లోర్స్ చేపట్టాలి. కాంట్రాక్టు సంస్థకు 60 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చారు. అప్పటివరకు దశలవారీగా అభివృద్ధి చేసుకోవచ్చు.

సపోర్టుగా..

(5వ పేజీ తరువాయి)

సరుకులను మచిలీపట్నం పోర్టుకు తరలించాలంటే మాచవరం వద్ద నిర్మించే రింగ్‌రోడ్డు ఎంతో ఉపయోగకరం. దీంతోపాటు నల్గొండ, హైదరాబాద్ నుంచి వివిధ రకాల ఎగుమతులు జాతీయ రహదారి-65, మాచవరం మీదుగానే పోర్టుకు చేరాలి. ఈ రెండు కారణాలతో మాచవరం రింగ్‌రోడ్డు నిర్మించే ప్రాంతం ప్రముఖ వ్యాపార కూడలిగా మారనుందని, సరుకుల ఎగుమతులు, దిగుమతులు ప్రారంభమైతే, ఈ ప్రాంతం స్వరూపమే మారుతుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. మనరాష్ట్రంలో వివిధ పరిశ్రమల్లో వినియోగించే బొగ్గును ఆస్ట్రేలియా నుంచి అధికశాతం దిగుమతి చేసుకుంటున్నారని, దీంతో పాటు ఒడిశా నుంచి బొగ్గు దిగుమతి భవిష్యత్తులో మచిలీపట్నం పోర్టు నుంచే జరిగే అవకాశాలు లేకపోలేదని మరో అంచనా.

సింగపూర్‌కు ఇండిగో

(5వ పేజీ తరువాయి)

సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయానికి కొత్త సర్వీసులు నడుస్తాయి. వారంలో మంగళ, గురు, శనివారాల్లో నడుస్తాయి.

గతంలో భలే డిమాండ్

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని నిర్మాణ క్రమంలో విజయవాడ నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలని వివిధ వర్గాల నుంచి డిమాండ్ వచ్చింది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో ఇండిగో సంస్థ విమాన సర్వీసు నడిపేందుకు ముందుకొచ్చింది. నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దీనిని ప్రారంభించారు. ఈ సర్వీసు రూ.9,500 టికెట్‌తో 90 శాతం ఆక్యుపెన్సీతో నడిచింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రయాణికులే కాకుండా ఉభయగోదావరి, ప్రకాశం జిల్లాలతో పాటు ఖమ్మంజిల్లా ప్రజలు కూడా ఉపయోగించుకున్నారు. వీజీఎఫ్ విధానం ప్రకారం విమాన ప్రయాణికులు తగ్గితే, ఆ నష్టాన్ని ప్రభుత్వం నిర్ణీత కోటా మేరకు భరిస్తుంది. కానీ, సింగపూర్ విమాన సర్వీసుకు వచ్చిన అనూహ్య ఆదరణతో వీజీఎఫ్ అవసరమే లేకుండాపోయింది.

వైసీపీ హయాంలో సర్వీసు రద్దు

వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీజీఎఫ్ విధానాన్ని ఉపసంహరించుకుంది. దీంతో ఇండిగో సర్వీసును రద్దు చేసింది. దీనివల్ల వ్యాపార వర్గాలు, పర్యాటకులు, విద్యార్థులు, ఎన్ఆర్ఐలు నష్టపోయారు. నాటి నుంచి ఆరేళ్లుగా విజయవాడ నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసు నడవలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. సింగపూర్‌కు విమాన సర్వీసును నడపాలని వ్యాపార వర్గాల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చింది. ఏపీ చాంబర్స్ కూడా లేఖలు రాయడంతో ఇన్నాళ్లకు కల సాకారమైంది. అమరావతి పునర్నిర్మాణం దిశగా అడుగులు వేయటంతో పాటు విదేశీ పెట్టుబడిదారులకు కూడా ఆహ్వానం పలుకుతోంది. స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాలను రూపొందించుకుని పర్యాటకాభివృద్ధిని సాధించాలన్న లక్ష్యాలను నిర్దేశించుకుంది. సింగపూర్ విమాన సర్వీసు ద్వారా విదేశీ పర్యాటకులను ఆకర్షించటానికి అవకాశాలు ఉంటాయి. విజయవాడ, అమరావతి సందర్శన ద్వారా పర్యాటకాభివృద్ధికి దోహదపడుతుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

విఘ్నేశ్వర స్వామి ఉపాలయ నిర్మాణానికి విరాళం



హనుమాన్‌జంక్షన్: బాపులపాడు శ్రీశైలమల్లికార్జునస్వామి దేవాలయం ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా విఘ్నేశ్వర స్వామి ఉపాలయానికి విరాళం అందజేశారు. నూజివీడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి భక్తుడు పోట్ల వెంకటేశ్వరరావు స్వామి శనివారం రూ.4లక్షలు విరాళం అందించారు. తన భార్య కనకదుర్గ జ్ఞాపకార్థం విరాళం అందజేశారు. దాతను ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, సభ్యులు గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్, వీరమాచనేని నాగయ్య, రాంబాబు, వల్లభనేని అనిల్ తదితరులు అభినందించారు.





పాలకమండలి సభ్యులు వెలగపూడి శంకరబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. ప్రమాణస్వీకారానికి వెళ్తున్న శంకరబాబు

దుర్గగుడి ప్రతిష్ఠను మరింత పెంచాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రతిష్ఠను మరింత పెంచాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నూతన కమిటీకి సూచించారు. శనివారం దుర్గమ్మ ఆలయ పాలక మండలి కమిటీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలకమండలి అధ్యక్షుడు బొర్రా రాధాకృష్ణ, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పెనమలూరు నుంచి పాలకమండలి సభ్యునిగా ఎంపికయిన టీడీపీ సీనియర్ నాయకులు వెలగపూడి శంకరబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకర రావు, కోయ ఆనంద్‌ప్రసాద్, చిన్నారి, మంచినేని పరమేశ్ తదితరులు ఉన్నారు.

రోగులకు చిరునవ్వుతో సేవలందించాలి

ఘనంగా సిద్ధార్థ నర్సింగ్ కళాశాలల వార్షికోత్సవం



గోల్డ్ మెడల్, ఉత్తమ అవార్డు అందుకుంటున్న కొత్తలంక సంధ్య

గన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోగులకు చిరునవ్వుతో సేవలందించాలని హైదరాబాద్ ఫెర్నాండెజ్ ఫౌండేష్ ఆఫ్ హెడ్ నర్సింగ్ సర్వీసెస్ సుమాని అజయ్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ అండ్ నర్సింగ్ అండ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాన్యువల్‌డే సెలబ్రేషన్స్ శనివారం ఘనంగా జరిగాయి. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సుమాని అజయ్ మాట్లాడుతూ నర్సులకు అత్యధిక అవసరత ఉందని, డాక్టర్లు కొద్దిసేపు మాత్రమే రోగులతో ఉంటారని 24 గంటలు నర్సులే వారి బాగోగులు చూసుకుంటారని చెప్పారు. రోగులకు అంకితభావంతో సేవలందించాలని చెప్పారు. డాక్టర్ పిన్నమనేని మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ, నైటింగేల్ స్ఫూర్తితో నర్సింగ్‌లో రాణించాలని చెప్పారు. ఆమె స్ఫూర్తి అందరికి ఆదర్శనీయమన్నారు. రోగులకు సత్సంబంధాలు నర్సులతోనే ఉంటాయని చెప్పారు. అనంతరం నాలుగు సంవత్సరాల నర్సింగ్ విద్యలో రాణించిన విద్యార్థులకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. సిద్ధార్థ అకాడమి కోశాధికారి ఎస్.వెంకటేశ్వరావు, నర్సింగ్ కళాశాలల కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజగోపాల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ఏవో టీవీ సుబ్బారావు, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ జె.వందన, కె.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అలరించాయి.

సర్వీస్ రోడ్డుపైనే స్టాండ్!

- రోడ్లపై ఇసుక, కంకర గుట్టలుగా పోసి వ్యాపారం
- వాహనాల రాకపోకలకు అవరోధం
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు



ఉయ్యూరు నుంచి గండిగుంట వెళ్లే సర్వీసు రోడ్డులో కంకర, ఇసుక గుట్టలు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరులో ఆర్‌అండ్‌బీ రోడ్లు, హైవేపక్కన సర్వీసు రోడ్లపైన ఇసుక, కంకర వ్యాపారం జోరుగా సాగుతుంది. రోడ్లను ఆక్రమించి కొండల్లా కంకర, ఇసుక గుట్టలు పోసి రాజకీయ నాయకుల అండతో వ్యాపారం చేస్తూ రోడ్డుపైన వెళ్లేవారికి అసౌకర్యం కలుగజేస్తున్నారు. ఉయ్యూరు నుంచి కాటూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో హిందూ శ్మశానవాటిక వద్ద, జాతీయ రహదారి పక్కన గండిగుంటవైపు వెళ్లే సర్వీసురోడ్డు పొడవునా కంకర, ఇసుక గుట్టలు పోసి ట్రక్కులలోకి కూలీలతో ఎత్తిపోస్తున్నారు. దీంతో వాహనాలు తప్పుకునే వీలులేక ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. కంకర, ఇసుక రోడ్డుపైన ఉండటంతో ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు జారిపడి గాయాల పాలవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఉయ్యూరు పరిధిలో ఆర్ అండ్‌బీ రోడ్డు, సర్వీసు రోడ్లను సొంత ఆస్తిలా ఇసుక, కంకర గుట్టలతో నింపి వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోపవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధుల అండతో రోడ్లపై ఇసుక, కంకర గుట్టలుగా పోసి వ్యాపారం చేస్తూ వాహన చోదకులకు ఇబ్బంది కల్పిస్తున్నా చర్యలు తీసుకోపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపైన ఇసుక, కంకర గుట్టలు పోయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఉయ్యూరులో హిందూ శ్మశానవాటిక పక్కన రోడ్డుపైన కంకర గుట్టలు

సౌత్‌జోన్ ఖోఖో జట్ల ఎంపిక

గన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం స్త్రీ పురుషుల సౌత్‌జోన్ ఖోఖో పోటీల ఎంపికలు శనివారం నిర్వహించారు. అనంతరం ఖోఖో సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చారు. ఈ ఎంపికలో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయటం జరిగిందని చైర్మన్ గరటయ్య, టీఎస్‌ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ఉత్తమ ఖోఖో క్రీడాకారులను జాతికి అందించటమే లక్ష్యమని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ కేవీఆర్ కిషోర్ తెలిపారు. సీతారామిరెడ్డి, ప్రసాద్, సత్యప్రసాద్, రవిబాబు, ఖాసీం, గిరి ప్రసాద్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో జట్టుతో కేవీఆర్ కిషోర్



కళాశాలలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

500 మందికి నేత్ర పరీక్షలు

విజయవాడ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. జాతీయ సేవా సమితి, వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో జరిగిన వైద్యశిబిరంలో 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేశారు. రెండు రోజుల పాటు నేత్ర వైద్యశిబిరం కొనసాగుతుందని, కళాశాల విద్యార్థుల కంటి భద్రతను దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ ఎన్. సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ శ్రీనివాస్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.



రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

అభివృద్ధే ప్రధాన అజెండా

కంకిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధే ప్రధాన అజెండాగా పనిచేస్తుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. రూ. 23 లక్షలతో చేపట్టిన మండల పరిషత్ కార్యాలయ ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధే ప్రధాన అజెండాగా పనిచేస్తుదన్నారు. ఒక్క కంకిపాడు మండలంలోనే సుమారు రూ. 50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేసి చూపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దూళిపూడి సతీష్, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాసరావు, సతీష్, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నాను.



బాలికల ఆరోగ్యం, సామాజిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, హెచ్‌ఎం నిర్మల

మహిళలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ఉంగుటూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా వుండాలని ప్రముఖ ప్రసూతి స్త్రీవైద్య నిపుణురాలు (రెయిన్‌బో హాస్పిటల్స్) డాక్టర్ సునంద అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత , ఫిర్యాదు సెల్(వుమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్)ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సునంద మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యలపై అశ్రద్ధ తగదన్నారు. సభాధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, సమన్వయకర్తగా డబ్ల్యుఈజీసీ కోఆర్డినేటర్ ఆర్.భార్గవి వ్యవహరించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్ : బాలికల పట్ల వివక్షను తొలగించి సమగ్రాభివృద్ధితో బంగారు భవిష్యత్తు నిచ్చేలా ఆరోగ్యపరమైన జాగ్రత్తలతో కాపాడుకుందామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి అన్నారు. వీరవల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం నిర్మల పర్యవేక్షణలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. రమాదేవి, లలితకుమారి, హేమలత, సుహాసిని, ఇందిరాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న తాతినేని శ్రీహరి

విద్యార్థులు సవాళ్లను అధిగమించాలి

కానూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి ముందుకు సాగాలని లయన్స్ ఇంటర్నేషనల్ 316 డీ పూర్వ జిల్లా గవర్నర్ తాతినేని శ్రీహరి అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం కానూరులోని వైవీ రావు సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా 8వ రోజు అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీహరి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. ప్రత్యేక అతిథి విజ్ఞాన్ యూనివర్సిటీ సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ భాస్కర్ ప్రసంగిస్తూ జీవితంలో ప్రతి అనుభవాన్ని సానుకూల దృక్పథంతో స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. వైవీ రావు సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేషశ్రీ మాట్లాడుతూ, నేటి సమాజంలో రోజురోజుకూ సైకాలజీ ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ బావిశెట్టి, శ్రీనివాస్, చంటి, బి. కృష్ణ, జయశ్రీ, రమ్య, ముకరింజి పాల్గొన్నారు.



కానూరు న్యూ ఆటోనగర్‌లో హిందుస్థాన్ ఎకో ప్రొడక్షన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

పర్యావరణహితమే లక్ష్యం కావాలి

ఎమ్మెల్యే సుజనా చౌదరి


కానూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత ప్లాస్టిక్‌ను పునర్వినియోగించడం ద్వారా వనరులు సంరక్షించుకోవచ్చని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. శనివారం కానూరు న్యూ ఆటోనగర్‌లో హిందుస్థాన్ ఎకో ప్రొడక్షన్స్‌ను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరాతో కలిసి ఈ ప్రారంభోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించేందుకు కృషిచేస్తూ వ్యాపారాన్ని ప్రారంభించిన ఏకో ప్రొడక్షన్స్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌తోపాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆట వస్తువుల బహూకరణ

ఉయ్యూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జన్మస్థలం, విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి తోచిన విధంగా సహాయం చేస్తానని వెల్లంకి ఫుడ్స్ అధినేత వెల్లంకి శంకరరావు అన్నారు. కలవపాములలో మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లకు లక్ష రూపాయల విలువచేసే ఆట వస్తువులు, వ్యాయామానికి ఉపయోగపడే వివిధ పరికరాలు అందజేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల శారీరక అభివృద్ధికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బాదర్ల భారతీలక్ష్మి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు కామా మోక్షభాగ్యం, సుధాకర్‌రావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు శాస్త్రి పాల్గొని శంకరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



కలవపాముల స్కూల్‌లో ఆట వస్తువులు ప్రారంభిస్తున్న వెల్లంకి








ఇనుములో.. ఓ హృదయం మొలిచెనే!

న్యూ లుక్‌తో స్ర్కాప్ పార్క్! వాహనాల విడిభాగాలు, పాత ఐరన్ భాగాలతో విభిన్న ఆకృతులు

ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్: స్ర్కాప్ పార్క్ సరికొత్తగా ముస్తాబైంది! రంగురంగులతో మెరిసిపోతోంది! బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులపై రాకపోకలు సాగించే వారికి కను 'విందు' చేస్తోంది. పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న వీఎంసీ స్ర్కాప్ పార్కు నూతన హంగులతో సందర్శకులను ఆకట్టుకుంటోంది. కంట్రోల్ రూమ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వాహనాల విడిభాగాలు, ఐరన్ స్ర్కాప్, పాత ఇనుము డిస్కులు తదితర ఐరన్ వ్యర్థాలతో అద్భుతమైన ఇనుప కళాఖండాలను సృష్టించారు. వివిధ జంతువులు, పక్షుల బొమ్మలతో అందంగా తీర్చిదిద్దారు. ఇవి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాజాగా వాటికి ఇటీవల మరలా మెరుగులు దిద్దారు. అందంగా రంగులు వేశారు. పార్క్‌లో లాన్‌ను అభివృద్ధి చేశారు. కళాఖండాలను ఉంచటానికి వీలుగా కొన్ని కట్టడాలు కట్టారు. కట్ చేస్తే.. సరికొత్తగా స్ర్కాప్ పార్క్ ముస్తాబైంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలతోపాటు ప్రయాణికులను ఇతర ప్రాంతాల నుంచే వచ్చే వారిని ఆకట్టుకుంటున్నాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్‌తో పాటు నగరంలోని ప్రధాన కూడలి కావడంతో నిత్యం వేలాది మంది సందర్శకులు ఈ పార్కును సందర్శించి ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. స్ర్కాప్ పార్కులో జింక, డైనోసర్, జిరాఫీ, కప్ప, ఈగ, మోటర్ సైకిల్, వివిధ పక్షుల బొమ్మలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పార్కులో ఈ ఆకృతులను చూసేందుకు నగరంలోని ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ పార్కు నగరానికి నూతన శోభను తీసుకొచ్చింది.






సీపీ రాజశేఖరబాబుకు ఆహ్వానం పలుకుతున్న పోలీస్ డాగ్

డాగ్ కెనాల్స్ ప్రారంభం

విజయవాడ సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బందోబస్తులు, నేర పరిశోధనలలో డాగ్స్ సేవలు ప్రశంసనీయమని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. నగరంలోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో నూతనంగా నిర్మాణం చేసిన డాగ్ కెనాల్స్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు నెలలో డాగ్ కెనాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి అనతి కాలంలోనే నిర్మాణం పూర్తి చేయించామన్నారు. మందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఎక్స్‌ప్లోజివ్స్‌ను గుర్తించడంలో డాగ్స్ కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. శిక్షణ తీసుకున్న పోలీస్ డాగ్స్ కమిషనర్‌కు స్వాగతం పలికాయి. అనంతరం డాగ్స్ నైపుణ్యాలను ప్రదర్శించారు.

రాష్ట్రంలో ఎయిర్ కార్గో సేవలు అందుబాటులోకి రావాలి

● ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు

విజయవాడ సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎయిర్ కార్గో సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రిలో ఎయిర్ పోర్టులు ఉన్నాయని, ప్రస్తుతం వాటి విస్తరణ కొనసాగుతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. అయితే రాష్ట్రానికి మత్స్య ఉత్పత్తులు, పువ్వులు, ఔషధాలు, మొక్కలు, బంగారం, వెండి, వజ్రాలు, పారిశ్రామిక పరికరాలకు ఎగుమతులు, దిగుమతులు జరుతాయన్నారు. రాష్ట్రంలో ఎయిర్ కార్గో సర్వీసు అందుబాటులో లేకపోవడంతో నేటికీ ఎగుమతులు, దిగుమతులు బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై విమానాశ్రయాల నుంచి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎయిర్ కార్గో సేవలు అందుబాటులోకి వస్తే పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, మహిళా వ్యాపారవేత్తలు, స్టార్టప్‌లు లాభపడతాయన్నారు. రాష్ట్రంలో బలమైన కార్గో వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని ఎయిర్ కార్గో ఫోరం ఇండియా (ఎసీఎఫ్ఐ)ను ఆయన కోరారు.



పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

కృష్ణాజిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా బందరు మండలం కరగ్రహారం కార్యదర్శి కే నరసింహారావు ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీవో హోంలో శనివారం జరిగిన ఎన్నికలకు డీపీవో కార్యాలయ ఏవో సీతారామయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా కే రామ్మోహనరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పెనమలూరు మండలం గంగూరు పంచాయతీ కార్యదర్శి డీ ప్రకాష్‌నాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాపులపాడు మండలం మడిచర్ల పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రామాంజనేయులు, కోశాధికారిగా మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీ కార్యదర్శి జే రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రాజేష్, ఝాన్సీలక్ష్మీ, ఎలీషా, ఏవీ చిరంజీవి (గూడూరు), సంయుక్త కార్యదర్శులుగా సాయిరాం (మానికొండ), ఎంఎస్ఎన్‌మూర్తి (మచిలీపట్నం), మునిరాజు (కాటూరు) ఎన్నికయ్యారు. వీరితో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూర్వ అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరావు, రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ప్రధాన కార్యదర్శి జీటీవీ రమణ పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జే అరుణ అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన డైరెక్టర్ జనరల్ పీవీ రమణ

కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ, నిర్వహణ, నిల్వ ప్రక్రియలో భద్రతా ప్రమాణాలను పాటించి అగ్ని ప్రమాదాలు, పేలుళ్లను నివారించేందుకు నిర్దేశించిన ప్రామాణిక నిర్వహణ విధానాలను ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేలుడు పదార్థాల నియమాలు, 2008కి అనుగుణంగా, లైసెన్స్ పొందిన తయారీదారులు విధిగా భద్రతా చర్యలను పాటించాలన్నారు. ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని డైరెక్టర్ జనరల్ పీవీ రమణ తెలియజేశారు.

కొత్త వ్యవసాయ విధానాలపై దృష్టి

● ఆయిల్ పామ్, కొరమీను సాగుతో అధిక లాభాలు ● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఘంటసాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు మారాల్సిన అవసరం ఉందని, నూతన వ్యవసాయ విధానాలపై రైతులు దృష్టి సారించి మంచి ఆదాయం పొందాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ప్రధాని మోదీ న్యూఢిల్లీలో ధన ధాన్య కృషి యోజనను శనివారం లాంఛనంగా ప్రారంభించగా, వర్చువల్‌గా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం నుంచి కలెక్టర్ బాలాజీ పాల్గొన్నారు. అనంతరం రైతులనుద్దేశించి ప్రసంగించారు. సాగునీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో సాగులో జిల్లా ముందజంలో ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక పెట్టుబడులతో వరిసాగులో రైతులకు స్వల్ప ఆదాయం మాత్రమే లభిస్తుందన్నారు. అనంతపురం వంటి కరువు ప్రాంతంలో రైతులు ఉద్యాన పంటల వైపునకు మారి అధిక ఆదాయం పొందుతున్నారన్నారు. గతంలో ఈ ప్రాంతంలో చెరకు సాగు చేసిన రైతులు ఆయిల్ పామ్‌పై దృష్టి సారించారని, ఈ సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు, మొవ్వ మండలం చినముత్తేవి గ్రామాల్లో ఉదయ్ ఆక్వాతో ఒప్పందం కుదుర్చుకున్న రైతులు కొరమీను సాగు చేస్తున్నారన్నారు. కొరమీను సాగుకు పీఎంఈజీటీ పథకం కింద రుణం మంజూరుతోపాటు 35 శాతం సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ క్షేత్రంలో ఎకరం భూమిలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న ఎంటీఎం 1318 రకం పంటను పరిశీలించిన కలెక్టర్ సమన్వయకర్త డీ సుధారాణి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి, సర్పంచ్ బీ వెంకటేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పద్మావతి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి చిన్న నరసింహులు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరిబాబు, వ్యవసాయ శాఖ డీడీ మనోహర్, ఏడీ మణిదుర్ర, ఎంపీడీవో సుబ్బారావు, ఘంటసాల, చల్లపల్లి ఏవోలు అనూష, కే మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మీ, నవీన్, యశ్వంత్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

శయన బుద్ధ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయండి

అసంపూర్తిగా ఉన్న శయన బుద్ధ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ కలెక్టర్ బాలాజీని కోరారు. ఘంటసాల విచ్చేసిన కలెక్టర్ బాలాజీని కలిసిన రామకృష్ణ శయన బుద్ధ ప్రాజెక్టు వివరాలు తెలిపారు. గతంలో ఈ ప్రాజెక్టును సందర్శించినప్పుడు కలెక్టర్ నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఇచ్చిన హామీని రామకృష్ణ గుర్తు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ద్వారా ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రస్తుతం పనులు కొనసాగేలా తమ పరిధిలో నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ నిధుల కొరత ఉందని, తప్పనిసరిగా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

కలెక్టరేట్‌లో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

మచిలీపట్నం: ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టరేట్‌కు అర్జీలు ఇచ్చేందుకు వచ్చే మహిళలకు కలెక్టరేట్‌లో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఉన్న కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించే వాహనాన్ని కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఇందులో ఇద్దరు మహిళా వైద్యులు, రేడియాలజిస్ట్ ఉంటారని, బ్రెస్ట్ కేన్సర్, అల్ట్రాసౌండ్, మామోగ్రామ్ వంటి వైద్య పరీక్షలు ఇక్కడ చేస్తారన్నారు. ఈ పరీక్షల ఫలితాలను అత్యంత గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

13 నుంచి 19 వరకు బందర్ బొనంజా

సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్ అమలులో భాగంగా ప్రభుత్వం తరపున మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్‌హాలులో ఈనెల 13 నుంచి 19 వరకు బందర్ బొనంజా షాపింగ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు జేసీ ఎం నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ-2.0 సంస్కరణల అమలులో భాగంగా ఈ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశామన్నారు. వివిధ రకాల వస్తువుల ధరలు తగ్గిన నేపథ్యంలో ఇక్కడ వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పాదరక్షలు, స్టేషనరీ, బొమ్మలు, సౌర పరికరాలు, ఇమిటేషన్ జ్యూయలరీ, కలంకారీ ఉత్పత్తులతో పాటు, ఇన్సూరెన్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. ఇక్కడ వస్తువులు కొనుగోలు చేస్తే వివిధ రకాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపు ఎంతమేర జరిగిందనే అంశంపై ప్రజలకు కనీస అవగాహన కలుగుతుందన్నారు. మచిలీపట్నంతోపాటు, పరిసరప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు సాధికారత లక్ష్యంగా

సరికొత్త పథకాలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ





అంతర్జాతీయ బాలికా దినోత్సవ పోస్టరును ఆవిష్కరిస్తున్న డీఆర్‌వో లక్ష్మీ నరసింహం

కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల క్షేమం, సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సరికొత్త పథకాలు ప్రవేశపెడుతున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుని సాధికారత సాధించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.24వేల కోటతో ధన్ ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకంతో పాటు రూ.11,440 కోట్లతో పప్పు ధాన్యాల్లో ఆత్మనిర్భరతా మిషన్‌ను ప్రారంభించారు. అలాగే వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి వివిధ ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడంతో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు వివిధ పథకాలు, కార్యక్రమాలు ప్రారంభిస్తున్నాయని, వీటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవడం ద్వారా సాగును లాభసాటిగా మార్చుకొని, ఆర్థికంగా ఎదగొచ్చన్నారు. జిల్లాలో రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహిస్తున్నామన్నారు. పాడి రంగంలో మంచి వృద్ధికి అవకాశమున్న నేపథ్యంలో జిల్లా, నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికల్లో స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషిచేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. నగరంలోని రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం భవనం (రైతు నిలయం) నుంచి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయగా జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పీ బాలాజీ కుమార్, ఏడీఏ జ్యోత్స్న, వ్యవసాయ అనుబంధ శాఖాధికారులు పాల్గొన్నారు.

బాలికా విద్య, సాధికారతకు సమష్టి కృషి: డీఆర్‌వో

వివక్షకు తావులేకుండా బాలికలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం పురోగతి సాధిస్తుందని, బాలికా విద్య, హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందని, డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ (సీఆర్ఏఎఫ్) అధ్వర్యంలో భాగస్వామ్య పక్షాలకు ప్రత్యేక వర్క్‌షాపు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌వో మాట్లాడుతూ బాలికా విద్య, ఆరోగ్యం, హక్కుల పరిరక్షణ, సామాజిక వివక్షను రూపుమాపడం, బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడం తదితరాల్లో సమన్వయ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. గ్రామ స్థాయిలో బాలల సంక్షేమం, భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 18 వరకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీడీపీవో పీ భానుమతి, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాధకుమారి, డీసీపీవో ఎం రాజేశ్వరరావు, సీఆర్ఏఎఫ్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, సమగ్రశిక్ష అధికారి శిరీష రాణి, ఎంఈవో పుష్పలత, చిన్నారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఒక వైపు సూపర్ సిక్స్...

ఇంకోవైపు సూపర్ జీఎస్టీ

● జీఎస్టీపై మంత్రి సవిత, ఎమ్మెల్యే గద్దె ప్రచారం

మొగల్రాజపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీలో సంస్కరణలు తీసుకురావడంతో నిత్యావసరాలపై పన్నులు తగ్గి అమ్మకాలు పెరగడంతో వ్యాపారులు, సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రి సవిత, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం నియోజకవర్గంలో 8వ డివిజన్ పాలీక్లినిక్ రోడ్డులో జీవీవీ రాధా మాధవ్ ఆపార్టుమెంట్స్‌లో మంత్రి సవితతో కలిసి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జీఎస్టీ-2.0 సంస్కరణలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రధాని మోదీ తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలకు సీఎం చంద్రబాబు మద్దతు తెలపడం, ప్రజలు, వ్యాపారులు స్వాగతించడం మంచి పరిణామమన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నిత్యావసరాలు ధరలు పెరగడమే కానీ తగ్గింది లేదని కానీ జీఎస్టీ సంస్కరణలతో మోదీ, చంద్రబాబు చేసి చూపించారన్నారు. రాష్ట్ర ఖజనాకు రూ.8 వేల కోట్ల నష్టం జరిగినా ప్రజల కోసం సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్, మోదీ సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు వారికి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ, బొండా సుజాత, చెన్నుపాటి ఉషారాణి, పుట్టగుంట వెంకట సతీష్, దండమూరి స్టాలిన్, యార్లగడ్డ రాజశేఖర్, సంజయ్‌జైన్ పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లు అటకెక్కినట్టేనా..?

● 2 నెలల క్రితం ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే గద్దె, కలెక్టర్ పరిశీలన
● 3 చోట్ల అండర్‌పాస్‌లు అవసరమని నిర్ణయం
● ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు లేవు
● ఆవేదన వ్యక్తం చేస్తున్న స్థానికులు



సత్యం హోటల్ సెంటర్ వద్ద..

కృష్ణలంక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై అండర్‌పాస్‌ల నిర్మాణం అటకెక్కినట్టేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 2 నెలల క్రితం ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ, ఇరిగేషన్, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది బస్టాండ్ నుంచి నేతాజి బ్రిడ్జి వరకు పరిశీలించారు. రైతు బజారు వద్ద వంతెన ఎదురుగా, అమెరికన్ ఆస్పత్రి వంతెన వద్ద, పశువుల ఆస్పత్రి వంతెన (నే తాజీ సుభాష్‌చంద్రబోస్ బ్రిడ్జి) వద్ద అండర్‌పాస్‌లు కావాలనివారు గుర్తించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీలు గుప్పించారు. కానీ ఇప్పటి వరకు అతీగతీ లేకపోవడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పైగా ఆయా ప్రాంతాల్లో రోడ్డు దాటుతూ చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ఐసీడీఎస్ సీడీపీవో, అంగన్వాడీ సూపర్‌వైజర్ సస్పెన్షన్

గుడివాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల పరిధిలోని చిన్నారుల బరువులను తూయకుండానే రికార్డుల్లో నమోదు చేయడం, విధుల్లో అలసత్వం వహించడం కారణంగా గుడివాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో విజయ ఫ్లారెన్స్, గుడ్లవల్లేరు అంగన్వాడీ సూపర్‌వైజర్ మేరీలను సస్పెండ్ చేస్తూ మహిళ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సేకరించిన సమాచారం ప్రకారం..గుడ్లవల్లేరు మండలంలో పలు అంగన్వాడీల్లో జిల్లా అధికారులు చేసిన తనిఖీల్లో చిన్నారుల బరువును చూడకుండానే నమోదు చేయడాన్ని గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించారు. దీంతో రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మంత్రి సత్యకుమార్‌కు సత్కారం



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న గుడివాడ హోమియోపతి కళాశాల పీజీ విద్యార్థులు

గుడివాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆయూష్ శాఖకు చెందిన పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లకు ఉపకార వేతనాలను పెంచడంపై హోమియోపతి పీజీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయ ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను గుడివాడ హోమియోపతి కళాశాల పీజీ విద్యార్థులు సత్కరించారు. ఇంటిగ్రేటెడ్ కళాశాలను గుడివాడలో నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ గురురాజు హోమియోపతి కళాశాల 70 పడకల భవనం నుంచి ప్రారంభించాలని మంత్రి సత్యకుమార్‌ను కోరారు. త్వరలో గుడివాడ వచ్చి నిర్మాణాలను పరిశీలిస్తానని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారని విద్యార్థులు తెలిపారు.

ప్రమాదాలకు దారితీసేలా..

గుడివాడ- మచిలీపట్నం ప్రధాన రహదారిపై మార్కెట్ యార్డు వద్ద ఎస్ ఆకారంలో రహదారి

- స్పీడ్ బ్రేకర్లు, వీధి లైట్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు
- అధికారులు పట్టించుకోవడం లేదంటున్న స్థానికులు

(గుడివాడ రూరల్-ఆంధ్రజ్యోతి): గుడివాడ- మచిలీపట్నం వెళ్లే ప్రధాన రహదారిపై గుడివాడ మార్కెట్ యార్డు వద్ద ఎస్ ఆకారంలో రహదారి ఉండటం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొని చాలా మంది గాయపడడం, చనిపోవటం జరుగుతోంది. రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒక లారీ డ్రైవర్‌కు కాలు విరిగింది. ఎస్ ఆకారంలో ఉండటంతో బందరు, గుడివాడ నుంచి వచ్చే వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకుంటున్నాయి. ఈ ప్రదేశంలో స్పీడు బ్రేకర్లు వేయాలని ఆటోనగర్ వాసులు ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా ఎవరు పట్టించుకోవటం లేదు. అక్కడ టిడ్కో కాలనీకి వెళ్లే రహదారి మలుపులో విద్యుత్ సౌకర్యం లేదు. రాత్రి పూట చీకటిగా ఉండటంతో ఏ వాహనం వస్తుందో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల్లో విద్యుద్దీపాలు లేకపోవడంతో ఇటు టిడ్కో కాలనీ, అటు మచిలీపట్నం, గుడివాడ నుంచి వచ్చే వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయని వీధి లైట్లు, స్పీడ్‌బ్రేకర్లు వేయాలని టిడ్కో కాలనీ, బొమ్ములూరు, గుడివాడ వాసులు కోరుతున్నారు.



మార్కెట్ యార్డు వద్ద ఎస్ ఆకారంలో ఉన్న రహదారి



టిడ్కో కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి



ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు

రెవెన్యూ, మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులకు చాలాసార్లు వినతిపత్రం అందజేశాం. ఎవరూ పట్టించుకోవటం లేదు. వారానికి రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో త్వరలోనే మార్కెట్ యార్డు వద్ద టిడ్కో కాలనీ వాళ్లంతా కలిసి ధర్నా చేయాలని నిర్ణయించుకున్నాం. అప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్లు, స్పీడ్ బ్రేకర్లు వేస్తారని ఆశిస్తున్నాం.

- రత్నదాసు, టిడ్కో కాలనీ వాసి



భూషగణగుల్ల ప్రధాన రహదారిపై గోతులు

భూషణగుల్ల రహదారి
గోతులమయం

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

(పెదపారుపూడి-ఆంధ్రజ్యోతి): భూషణగుల్ల గ్రామ ప్రధాన రహదారి గోతులమయంగా ఉంది. అంబేడ్కర్ నగరం, బాబూజగ్జీవన్‌రావు నగరం వెళ్లటానికి మూడు వేల మంది ఇదే ప్రధాన జిల్లా పరిషత్ రహదారి. ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర లోతైన పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రహదారి పూర్తిగా ధ్వంసమైంది. వాహనదారులు, పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, గ్రామ ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు గుంతలు పెద్దవయ్యాయి. రాత్రి వేళ వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, అధికారులను స్థానికులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా పట్టించుకుని రహదారిని అభివృద్ధి చేయాలని వారు వేడుకుంటున్నారు.

ఇబ్బందికరంగా ప్రయాణం ..



గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డులు వేసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డు వేయాలని కోరుతున్నాం. ఈ రోడ్డుపై ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంది. సమస్యను సత్వరమే పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నాం.

- శ్రీకాంత్ సంపంగి, గ్రామస్థుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



భూషణగుల్ల గ్రామ ప్రధాన రహదారి గుంతలమయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే రహదారి చెరువులా మారుతోంది.

- ఆలా రమేష్, గ్రామస్థుడు

ఉత్తమ ఉపాధ్యాయుడిగా
విద్యాలయ డైరెక్టర్ విజయభాస్కర్

గుడివాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ అసోసియేషన్(డెమొక్రటిక్) ఆధ్వర్యంలో విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన వెంకట విజయభాస్కర్‌ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి, ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గుంటూరులోని ఎన్జీవోస్ కల్యాణ మండపంలో శనివారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన అప్సా ఆధ్వర్యంలో గురుదేవోభవ పురస్కార్ అవార్డు ప్రదానం కార్యక్రమంలో విజయ్‌భాస్కర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, అప్సా జిల్లా కమిటీ సభ్యులు కొమ్మినేని సాంబశివరావు, పుట్టి రామచంద్రశేఖర్, సజ్జా అనీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

గుడివాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): యోగా గురువు, సామాజికవేత్త, మున్సిపల్ షాపుల అసోసియేషన్ అధ్యక్షులు కె.డి.వి.ఎన్ శ్రీనివాస్ సతీమణి కంచర్ల శివలీల పెద్దకర్మ సందర్భంగా మున్సిపల్ షాపుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న అన్నక్యాంటీన్‌లో శనివారం అన్నదానం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు సయ్యద్ గఫార్, కొత్త సుబ్బారావు, గజవల్లి బాలకృష్ణ, గుప్తా, వేముల కుటుంబరావు, రవ్వ హేమంత్, ఫణీంద్రకుమార్, రవ్వ స్వామి, వల్లంకొండ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి

చోరగుడిలో వైద్యశిబిరం

పమిడిముక్కల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చోరగుడి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 120 మందికి రవిప్రకాశ్ సిలికానాంధ్ర సంజీవని హాస్పిటల్ వైద్యబృందం వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసింది. ఈ కార్యక్రమంలో వైద్యులు లిల్లీపాల్, శిప్రసాద్, పవన్‌కుమార్, శ్వేత, దండమూడి సుభాశ్‌చంద్రబోస్ వైద్య పరీక్షలు, నేత్ర సంబంధిత పరీక్షలు చేశారు. టీడీపీ నాయకుడు కందిమళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు సేవలందించారు.

బొమ్ములూరులో కార్డన్‌సెర్చ్



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న సీఐ సోమేశ్వరరావు, ఎస్సై చంటిబాబు, పోలీసు సిబ్బంది

గుడివాడ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బొమ్ములూరు గ్రామంలో టపాసులు నిల్వ ఉంచారన్న సమాచారంతో కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు సీఐ సోమేశ్వరరావు శనివారం తెలిపారు. గ్రామంలో కొందరు గృహాల్లో నేల టపాసులు తయారు చేసి అనధికారికంగా నిల్వ ఉంచినట్టు గుర్తించామని తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంటిబాబు, ట్రైనీ ఎస్ఐ లోకేశ్వరి, గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెదపూడిలో రూ.40 వేలు విలువైన బాణాసంచా స్వాధీనం

కూచిపూడి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెదపూడి గ్రామంలోని గోడౌన్‌లో లైసెన్స్ లేకుండా అనధికారికంగా నిల్వ చేసిన రూ.40 వేల విలువైన మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.ఎస్.విశ్వనాథ్ తెలిపారు. అక్రమ బాణాసంచా నిల్వలు గ్రామానికి చెందిన గొట్టిపాటి సాయివిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. దీపావళికి ముందుగానే మొవ్వ, పెదపూడి, కూచిపూడి, నిడుమోలు, కోసూరు గ్రామాల్లో వ్యాపారులు భారీగా బాణాసంచా నిల్వ చేసినట్లు సమాచారం.

అనధికార మందుగుండు సామగ్రి పట్టివేత

గుడివాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురంలో దినేష్ కన్నా అనే వ్యక్తి ఇంటివద్ద అనధికారికంగా నిల్వ ఉంచిన దీపావళి మందుగుండు సామగ్రిని టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ హనీష్ మాట్లాడారు. ఎవరైనా లైసెన్స్ లేకుండా దీపావళి మందుగుండు సామగ్రిని అమ్మినా, నిల్వ ఉంచినా వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



సత్యనారాయణపురంలో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న టూటౌన్ పోలీసులు

ఘనంగా అంతర్జాతీయ దైవసేవకుల దినోత్సవం



దైవసేవకులను సత్కరిస్తున్న కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు నేలపాటి శ్యామ్యూల్

గుడివాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దైవసేవకులు సమాజంలో శాంతి, సహనం, ప్రేమతత్వం పెంపొందించడంలో సారథులుగా ఉండాలని, దేశక్షేమం కోసం ప్రపంచ శాంతి కొరకు ప్రార్థించి ప్రబోధించాలని కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు నేలపాటి శ్యామ్యూల్ సూచించారు. అంతర్జాతీయ దైవసేవకుల దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం దైవసేవకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లార్సన్ శ్యామ్యూల్, విద్యాసాగర్, జాన్‌కుమార్, ఫిలిప్, రత్నకిషోర్, జోసెఫ్ రత్నకుమార్, చంద్రపాల్, కిరణ్, అబ్రహాం, సురేష్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515



డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం విజయవాడలో కలిశారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన సభలో డిప్యూటీ సీఎంకు భారతదేశ ఆయుర్వేద వైద్య రంగ పునరుజ్జీవానికి కృషి చేసిన స్వర్గీయ దీవి గోపాలాచార్యులు జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు. గోపాలాచార్యులు స్వగ్రామం నాగాయలంక మండలం భావదేవరపల్లిలో నూతన విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు దీవి గోపాలాచార్యులు జీవితచరిత్ర పుస్తకం బహూకరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పేర్ని నానీపై చర్యలకు డిమాండ్

అవనిగడ్డ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాజీ మంత్రి పేర్ని నాని వ్యవహరిస్తున్నారని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ నేతలు శనివారం అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న సీఐపై ఇష్టానుసారంగా మాట్లాడటమే కాక పోలీసు ఆత్మస్థైర్యాన్ని, గౌరవ ప్రతిష్ఠలు దెబ్బతీసేలా పేర్నినాని వ్యవహరించారని వారు అన్నారు. గతంలోనూ కులాలు, మతాలను రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారని అన్నారు. వెంటనే పేర్ని నానీపై కేసు నమోదు చేయడంతో పాటు ఆయనను జిల్లా నుంచి బహిష్కరించాలని ఫిర్యాదు అనంతరం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు మాచవరపు ఆదినారాయణ, కర్రా సుధాకర్, బండే రాఘవ, పరుచూరి దుర్గాప్రసాద్, మండలి రామ్మోహనరావు, దాసినేని శ్రీనివాస్, కొండవీటి మధు, బచ్చు హనుమాన్, ముళ్లపూడి శ్రీనివాసరావు, కొల్లూరి ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో ఎస్సై శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

పేర్ని నానీ ఆగడాలకు అంతు లేకుండా ఉంది

● గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నానీ ఆగడాలకు అంతు లేకుండా పోతోందని గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీ వద్ద జరిగిన నిరసన కేసులో విచారణలో భాగంగా ఏ8 మేకల సుబ్బన్నను ప్రశ్నిస్తున్న ఆర్‌పేట సీఐ వద్దకు పేర్ని నాని అనుచరులతో కలిసి దూసుకెళ్లారని, అధికారిని బెదిరించడమే కాకుండా విచారణ ప్రక్రియకు అంతరాయం కలిగించారని, అది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రత్యక్ష దాడి అని ఆయన పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లడం తప్పుకాదని, విచారణ జరుగుతున్న వ్యక్తిని విడిపించమని ఒత్తిడి తేవడం చట్ట విరుద్ధమన్నారు. మాజీ మంత్రి చట్టాన్ని ఇలా అవమానించడం దారుణమన్నారు. చట్టం అందరికీ సమానమేనని, పేర్ని నానీకి మినహాయింపు లేదన్నారు. పోలీసు వ్యవస్థను అవమానించే ప్రయత్నం చేసిన పేర్ని నానీకి శిక్ష తప్పదని గురుమూర్తి హెచ్చరించారు.

జీఎస్టీ షాపింగ్ ఉత్సవం

విజయవంతంగా నిర్వహించాలి

● అధికారులకు జేసీ నవీన్ ఆదేశం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు నగరంలోని జడ్పీ కన్వెన్షన్ హాల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా నిర్వహించే షాపింగ్ ఉత్సవాన్ని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్లో షాపింగ్ ఉత్సవం ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారులందరితో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వారి ప్రదర్శనశాలలతో పాటు ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ కల్పన, సహాయ కమిషనర్ సుబ్రహ్మణ్యం, డీఐసీ జీఎంఆర్ వెంకటరావు, మెప్మా పీడీ సాయిబాబు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలపై వైసీపీ డ్రామాలు సిగ్గుచేటు

● టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వార్థప్రయోజనాల కోసమే వైద్య కళాశాలల పేరుతో వైసీపీ డ్రామాలు చేస్తోందని, అది సిగ్గుచేటు అని టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రైవేటు కోటాకు 50 శాతం సీట్లు కేటాయిస్తూ జీవో నెం. 107, 108, 133లను విడుదల చేసింది జగన్ ప్రభుత్వం కాదా అని ఆయన నిలదీశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూపాయి కూడా జగన్ ప్రభుత్వం ఎందుకు ఖర్చు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. ఖర్చుచేసిన రూ.1550 కోట్లు కేంద్రప్రభుత్వం ఇచ్చినవే అన్నారు. నాలుగేళ్ల జగన్ పాలనలో నిర్మాణాలు పూర్తయింది కేవలం 18 శాతం మాత్రమేనన్నారు. జగన్ ప్రభుత్వ విధానం కన్నా కూటమి ప్రభుత్వ పీపీపీ విధానం వల్ల రాష్ట్ర విద్యార్థులకు ప్రభుత్వ కోటాలో 110 సీట్లు అదనంగా వస్తాయని తెలిపారు. ప్రైవేటు కోటాలో మరో 110 సీట్లు పెరిగి మొత్తం 220 సీట్లు రాష్ట్ర విద్యార్థులకు అదనంగా వస్తాయన్నారు. పీపీపీ విధానంలో రాబోయే రెండేళ్లలో కాలేజీల నిర్మాణాలు జరిగి అందులో 1750 సీట్లు త్వరగా మన విద్యార్థులు పొందుతారన్నారు. వాస్తవాలను కప్పిపుచ్చి జగన్మోహనరెడ్డి, పేర్ని నాని, ఇతర వైసీపీ నాయకులు మెడికల్ కాలేజీలపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. నాయకులు తోట రామకృష్ణ, శ్రీపతి నాంచారయ్య, రాజారావు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి చేద్దాం

● వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ పిలుపు

అవనిగడ్డ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మత మార్పిడులకు అడ్డుకట్ట వేసి హైందవ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ పిలుపునిచ్చారు. శనివారం అవనిగడ్డలోని ఓ ఫంక్షన్ హాలులో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సమావేశం అధ్యక్షుడు కమ్మిలి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. సనాతన ధర్మంపై వరుస దాడులు, మత మార్పిడులపై వీహెచ్‌పీ సభ్యులు చర్చించారు. నాయుడు, చెట్టి నిరంజనరావు, తులసీ వసుంధర, మానేపల్లి విజయ్‌కుమార్, కొట్టి విజయ్, పులిగడ్డ వెంకటేశ్వరరావు, లంకే సీతారామాంజనేయ వర్మ, తోట సత్యనారాయణ, పరుచూరి దుర్గా ప్రసాద్, డాక్టర్ తుంగల శ్రీనివాస్, టీవీ గిరి, జి.వి. నగరాయులు, భూపతి సుబ్రహ్మణ్యం, బచ్చు విజయలక్ష్మి పాల్గొన్నారు.



స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌తో సర్పంచ్ కృష్ణకుమారి, ఈఓ, సచివాలయ ఉద్యోగులు

చల్లపల్లికి స్వచ్ఛ పంచాయతీ

రాష్ట్ర అవార్డు రావడం గర్వకారణం

చల్లపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ పంచాయతీగా స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డు సాధించటం చల్లపల్లి గ్రామానికి గర్వకారణమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. శనివారం స్వచ్ఛ చల్లపల్లి 3618వ రోజు స్వచ్ఛసేవలో కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఆమె పాల్గొన్నారు. స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి సేవలందించారు. జాతీయ రహదారిపై కాసానగర్ జంక్షన్ సమీపంలో కార్యకర్తలు స్వచ్ఛసేవలు అందించారు. స్వచ్ఛకార్యకర్తల నిస్వార్థసేవలు, పారిశుధ్య కార్మికుల సేవలు, స్వచ్ఛ ఉద్యమస్ఫూర్తి, పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది సహకారం, స్వచ్ఛ ఆంధ్ర అవార్డు సాధించేందుకు దోహదపడిందన్నారు. స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డీ ఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి, ప్రముఖులు డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, ప్రాతూరి శాస్త్రి, అడపా గురవయ్య, సజ్జా ప్రసాద్, భోగాది వాసుదేవరావు, చెక్‌పోస్టు వెంకటేశ్వరరావు, పి.భాస్కర్ పాల్గొన్నారు.

మండలి వెంకట కృష్ణారావుకు ఘన నివాళి

అవనిగడ్డ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు(ఎంవీకే) శత జయంతి వేడుకల్లో భాగంగా శనివారం నియోజకవర్గానికి చెందిన పలువురు న్యాయవాదులు వంతెన సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. న్యాయవాదులు మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొడాలి మురళి, వడ్డీ రవీంద్ర, మాదివాడ వెంకటకృష్ణారావు, రామిశెట్టి వేణుగోపాలరావు, ఇమ్మిడిశెట్టి సుబ్బారావు, కర్రా సుధాకర్, తుటారం ప్రసాద్, తలశిల శివరామకృష్ణ, టి.దత్తకుమార్, నాళం కేశవకుమార్, కొల్లూరి రామాంజనేయులు, కూరేటి వెంకటేశ్వరరావు, పోతుల శివ శ్రీనివాస్, పులిగడ్డ నాగేంద్రుడు, తిమ్మన సుబ్బారావు, గౌరి శంకర్, జి.నాగమల్లేశ్వరరావు, భాను, భాను ఫణీంద్ర, బాసు నాంచారయ్య నాయుడు, ఎంవీవీ నాగార్జునరావు, శ్రీపతి బాలసుబ్రహ్మణ్యం, కె.సుబ్బారావు, కె.మోహన్, కేవీజేకే ప్రసాద్, దామెర్ల శివనాగరాజు, మహిళా న్యాయవాదులు పరిశె సరస్వతి, దేవికృప, లక్ష్మీసౌజన్య, విద్యశ్రీ, శతజయంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగాయలంక: గ్రామంలోని మండలి వెంకటకృష్ణారావు విగ్రహానికి కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ చింతలపూడి మధు, ఆరు పీఏసీఎస్‌ల అధ్యక్షులు, తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు నివాళులర్పించారు.



మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మద్యం షాపుల్లో తనిఖీలు

మచిలీపట్నం క్రైమ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మొలకలచెరువు నకిలీ మద్యం ఘటన నేపథ్యంలో బందరు ఎక్సైజ్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. మచిలీపట్నం ఎక్సైజ్ పోలీసుల పరిధిలో ఉన్న 21 వైన్స్, 7 బార్లను రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు తనిఖీలు చేశారు. నగరంలోని షాపుల్లో మద్యం బాటిళ్లపై ఉన్న కోడ్‌ను ఎసిటాట్ మొబైల్ యాప్ ద్వారా పరిశీలించారు. వివరాలను నమోదు చేసుకున్నారు. ఆల్కహాల్ కిట్ల ద్వారా మద్యం నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 21 వైన్ షాపుల నుంచి 15 శాంపిల్స్, 7 బార్ల నుంచి 7 శాంపిల్స్ సేకరించి కెమికల్ ఎనాలసిస్‌కు పంపినట్లు ఇన్‌చార్జి సీఐ లక్ష్మణరావు తెలిపారు. ఎస్ఐ రవి పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఈశ్వర్ రెసిడెన్సీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగణనతో పాటు కులగణన కూడా చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు లింగం ఫిలిప్, నియోజకవర్గ కార్యదర్శి ఒంటిపులి లక్ష్మణ్, మహిళా కార్యదర్శి బి. రాజ్యలక్ష్మి, షేక్ ముంతాజ్, వై.ఆనందకుమార్ పాల్గొన్నారు.



వినతిపత్రమిచ్చాక మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సత్కరిస్తున్న రాధా-రంగా మిత్రమండలి సభ్యులు

కృష్ణాజిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలి

మచిలీ పట్నం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాకు వంగవీటి మోహన రంగా పేరు పెట్టేలా కృషి చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌ను తెనాలిలో శనివారం రాధా-రంగా మిత్రమండలి ఆంధ్ర, తెలంగాణ అధ్యక్షుడు చలికొండ ధర్మారావు తదితరులు వినతిపత్రం ఇచ్చారు. మిత్రమండలి సభ్యులు హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, సికబాల కోటేశ్వరరావు, అమ్మిశెట్టి హరికృష్ణ, గంగిశెట్టి బాబూరాజేంద్ర, పసుపులేటి శ్రీనివాస్, చలమలశెట్టి విజయకుమార్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ విజేతలకు అభినందన సభ

అవనిగడ్డ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం నుంచి డీఎస్సీ 2025 ద్వారా ఉద్యోగాలు సాధించిన 275 మందికి ఆదివారం ఉదయం అవనిగడ్డలో గాంధీక్షేత్రంలో అభినందన, సత్కార కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డీఎస్సీ శిక్షణకు అవనిగడ్డకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మెగా డీఎస్సీ ద్వారా కృష్ణాజిల్లాలో 1208 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధిస్తే వారిలో 275 మంది నియోజకవర్గానికి చెందిన వారు కావటం గర్వకారణమన్నారు.

హంసలదీవి రహదారిలో ముళ్లపొదలు

(కోడూరు-ఆంధ్రజ్యోతి): కోడూరు నుంచి దింటిమెరక మీదుగా హంసలదీవి వెళ్లే ప్రధాన రహదారికి ఇరుపక్కలా ఉన్న ముళ్లపొదలను రోడ్డుపైకి వచ్చేస్తున్నాయని, తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. దింటిమెరక నుంచి తిరుతపమ్మ గుడి వరకు ప్రధాన రహదారికి ఇరుపక్కలా ముళ్లచెట్లు బాగా పెరిగిపోయి ప్రయాణం ఇబ్బందికరంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్రవాహనాలపై ప్రయాణించలేకపోతున్నామని అంటున్నారు. అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.



రోడ్డుపైకి వచ్చేస్తున్న ముళ్లపొదలు



ఆలయ అధికారులకు వెండి నాగపడగ అందిస్తున్న దాతలు

వెండి నాగపడగ బహూకరణ

మోపిదేవి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి మచిలీపట్నానికి చెందిన సోడిశెట్టి వెంకట ప్రసన్నకుమార్ 525 గ్రాముల రూ.75 వేలు విలువైన వెండి నాగపడగను బహూకరించారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, ఆలయ అధికారులు బి.వై.కిషోర్, సాయిబాబుకు ఆయన అందజేశారు. దాతలను అధికారులు సత్కరించారు.

దేశభక్తికి మారుపేరు ఆర్ఎస్ఎస్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశభక్తికి, క్రమశిక్షణకు రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్(ఆర్ఎస్ఎస్) మారుపేరని స్టార్ కళాశాల అధినేత పి.శ్రీరామ్ అన్నారు. రాజుపేట చక్కలమేడ వద్ద శనివారం రాత్రి నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో ఆయన మాట్లాడారు. నగర సంఘ చాలక్ డాక్టర్ చిట్లా శ్రీహరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం జలాల్‌పేట, గొడుగుపేట, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తామనితెలిపారు. యశశ్రీ గోల్డ్ అధినేత చలమలశెట్టి దుర్గాప్రసాద్, హోమియోపతి వైద్యుడు తమ్మన వెంకటరఘునాథ్, న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాసరావు, శ్రీనాథ్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి పాల్గొంటారని తెలిపారు.



విగ్రహాల వాయు ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

వైభవంగా విగ్రహాల వాయు ప్రతిష్ఠ

నాగాయలంక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గణపేశ్వరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి పరివార దేవతల వాయు ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు పోతుకూచి సత్యనారాయణశాస్త్రి, దుర్భ హరిబాబు శాస్త్రి విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. కోదండ రామాలయ అభివృద్ధి కమిటీ కార్యక్రమాలను పర్యవేక్షించింది.



ప్రార్థనలు చేస్తున్న మతగురువు హఫీజ్ షోయబ్

ఘనంగా గ్యార్మీ వేడుకలు

గూడూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జష్నేగౌస్ అజమ్ దస్తగిర్ జన్మదినాన్ని పురస్కరించుకుని(గ్యార్మీ షరీఫ్)ను శనివారం హజరత్ నాల్ సాహెబ్ ఆస్థానాల్లో గ్యార్మీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ప్రార్థనలు చేసి జెండా ఆవిష్కరణ చేశారు. అన్న సమారాధన చేశారు. మత గురువు హఫీజ్ మొహమ్మద్ షోయబ్ సాహెబ్, ఇమామ్ ఎండీ జుమాల్ బేగ్ సాహెబ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎండీ ఇస్మాయిల్, అమీర్ హుస్సేన్‌లు పుస్తక పఠనం చేశారు. కమిటీ నిర్వాహకులు జహంగీర్‌బేగ్, షంషుల్ రెహమాన్, నిర్గస్‌షా, అబ్దుల్ మన్నన్, మన్సూర్, జబ్బర్, నూరుల్లా, మీరా పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

చల్లపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో శనివారం చల్లపల్లిలో హెచ్ఐవీ/ఎయిడ్స్ సుఖవ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు అవినాష్, వంశీకృష్ణలు జెండా ఊపి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. చల్లపల్లిలో పలు కూడలి ప్రదేశాల్లో ఎల్ఈడీ టీవీ మొబైల్ వ్యాన్ ప్రచార రథం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. చల్లపల్లితోపాటు వక్కలగడ్డ గ్రామంలోనూ ప్రచారం కొనసాగింది. క్లస్టర్ లింక్ వర్కర్స్ వి.రజని, పి.దేవి, పి.రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో

భీమేశ్వరరావుకు పతకాలు

పెడన, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహించిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన వరదా భీమేశ్వరరావు మూడు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించాడు. భీమేశ్వరరావును గణేష్‌జిమ్ అధినేత పుచ్చల సుబ్రహ్మణ్యం అభినందించారు.







